క్లుప్తంగా

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కామిడి రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి 5వ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మల్లావజ్జుల చంద్రశేఖర్‌శర్మ వైదిక నిర్వహణలో రామనామ మూలమంత్ర హవనం, ఆంజనేయస్వామి మన్యసూక్త అభిషేకం, సింధూర అలంకరణ, హనుమా చాలీసా పారాయణ తదితర కార్యక్రమాలను శాస్త్రోకంగా నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ రామనామస్మరణతో మార్మోగాయి. అనంతరం తీర్థప్రసాద వితరణతో పాటు నర్మెట పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



స్వామివారికి పూజలు చేస్తున్న స్వాములు, ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు భిక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రాంతం ఆలయాలకు చిరునామా అన్నారు. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధి నిధులు కేటాయించారని తెలిపారు. హనుమాన్ మాల చాలా పవిత్రమైందని, ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఎంపీటీసీ కవిత, నాచారం డైరెక్టర్ నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌కు చెందిన గడ్డం స్వప్న, కనకయ్య దంపతుల కూతురు గడ్డం ఆశ్రిత జగదేవ్‌పూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదివింది. ఇంటర్ ఫలితాల్లో 470 మార్కులకు 465 మార్కులు సాధించింది. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి గంగుల కమలాకర్ విద్యార్థిని ఆశ్రితను ప్రత్యేకంగా అభినంది శాలువాతో సన్మానించారు. తల్లిదండ్రులను అభినందించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్వగ్రామం బొప్పాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆవాహిక మండపదేవత ఆరాధన, నవగ్రహ కలశ స్థాపన, ఆరాధన క్షేత్రపాలక, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరారు. నియోజకరవర్గంలోని ప్రతీ మారుమూల గ్రామం అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ప్రతినిధులు



చైర్మన్‌ను సన్మానిస్తున్న జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌ను బుధవారం సిద్దిపేట జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు బాలకిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాజు, ఆంజనేయులు, యాదగిరిగౌడ్‌లు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన విద్యా కుసుమాలు

- పల్లె బడుల్లోనూ 100శాతం ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి



హుస్నాబాద్ మోడల్ స్కూల్



అఖిల, హుస్నాబాద్ (10 జీపీఏ)



హరిణి, హుస్నాబాద్ (10 జీపీఏ)



శివకౌశిక్, హుస్నాబాద్(10)



రుతిక, కోహెడ (10 జీపీఏ)



బి.శ్రీకార్, కోహెడ (10 జీపీఏ)

హుస్నాబాద్: పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల కాగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించి మండలంలోనే టాపర్‌గా నిలిచారు. ఇందులో పోలోజు అఖిల, చొల్లేటి హరిణి, శివనాద్రి వెన్నెల, తేలు శివ కౌసిక్‌లు 10 జీపీఏ సాధించి ఆదర్శంగా నిలిచారు. కేజీబీవీ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన ఎల్.పావని 9.7, బి.హిందూ 9.3 జీపీఏ సాధించారు. అదేవిధంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన సౌమ్య 9.3, స్ఫూర్తి 9.2 జీపీఏ సాధించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 57 మంది విద్యార్థులకు గాను 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన కల్లెం అఖిల్ 9.3, సూరంపల్లి శ్రీజ 9.3 జీపీఏ సాధించారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్, పోతారం(ఎస్), మీర్జాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, జిల్లెలగడ్డ గిరిజన గురుకులం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహ్మదాపూర్, పొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వందశాతం ఫలితాలను సాధించాయి. మొత్తం 210 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కేజీబీవీ, గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కె.రమ్య, బి.వందన 9.8జీపీఏలు సాధించి మండల టాపర్లుగా నిలించారు. మండలంలో 09 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 01 కేజీబీవీ పాఠశాల ఉంది. ఇందులో మొత్తం 209 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల విద్యాధికారి మొగుళ్ల నర్సింహారెడ్డి అభినందించారు.

కోహెడ(హుస్నాబాద్): కోహెడ హైస్కూల్‌కు చెందిన గోరిట్యాల రుతిక 10జీపీఏ సాధించారు. వనపర్తి శ్వేత, ఎడ్ల రిషిత 9.8 జీపీఏ పొందారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన బి.శ్రీకార్, వి.అర్జున్ 10జీపీఏ సాధించారు. విద్యార్థులను హెచ్ఎం రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.వి.చలపతి అభినందించారు.

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూల్మిట్ట మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మొగుళ్ల నర్సింహారెడ్డి తెలిపారు. మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కే.కావ్య 9.8 సాధించినట్లు ఆయన తెలిపారు.

పది విద్యార్థుల ప్రభంజనం



అఖిల(మాత్‌పల్లి, 10జీపీఏ)



కే.అంజన (లకుదారం, 10జీపీఏ)



మానస (ఇటిక్యాల, 9.8జీపీఏ)



ప్రభాకర్‌గౌడ్ (నెంటూరు, 10జీపీఏ)

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని 16 హైస్కూళ్లకు గాను మొత్తం 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్లో చదివిన మాత్‌పల్లికి చెందిన సిల్వేరి అఖిల, లకుదారంకు చెందిన కే.అంజన ఇద్దరు విద్యార్థినులు 10జీపీఏ సాధించారని ఎంఈఓ పి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

99.5శాతం ఉత్తీర్ణత

వర్గల్(గజ్వేల్): మండలంలోని విద్యార్థులు 99.5శాతం ఉత్తీర్ణత సాధించారు. 10 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, మూడు గురుకుల స్కూల్స్ కలిపి మొత్తం 679 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 676 మంది ఉత్తీర్ణులయ్యారు. వర్గల్ మండలం నెంటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గోవిందాపూర్ గ్రామానికి చెందిన యావపురం ప్రభాకర్‌గౌడ్ 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచి అందరి ప్రశంసలు చూరగొన్నాడు.

రాణించిన గజ్వేల్ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: మండలంలో మొత్తం 21 పాఠశాలల్లో మొత్తం 1069 మంది విద్యార్థులకు 1035 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు గజ్వేల్ ఎంఈవో సునీత తెలిపారు. వీరిలో గజ్వేల్ పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థి బి.సాత్విక (10జీపీఏ), బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి జీ.సంపత్(10జీపీఏ), బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన టీ.అర్చన(10జీపీఏ), ఎంజేపీ బాలుర గురుకులం(జగదేవ్‌పూర్)కు చెందిన సీహెచ్.కిరణ్‌కుమార్(10జీపీఏ), ఏ భానుప్రసాద్(10జీపీఏ), సమి కాంత(10జీపీఏ), టీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్ బాలికల గురుకులం(జగదేవ్‌పూర్)కు చెందిన ఎం.కీర్తి(10జీపీఏ) సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించిరు. అదేవిధంగా ప్రజ్ఞాపూర్‌లోని సేయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో 16 మంది విద్యార్థులు 10జీపీఏ సాధించడంపై పాఠశాల కరెస్పాండెంట్ ఇన్నారెడ్డి అభినందించారు.

ఉత్తీర్ణత అంతంతే..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థిని నిహీత 10జీపీఏ సాధించి ప్రతిభ చాటింది. అదే విధంగా ఇటిక్యాల పాఠశాలకు చెందిన మానస 9.8 గ్రేడ్ సాధించింది. జగదేవ్‌పూర్ బాలుర, గొల్లపల్లి, తిమ్మాపూర్, వట్టిపల్లి, చిన్నకిష్టాపూర్, ఆదర్శ పాఠశాలలో వందశాతం ఫలితాలు సాధించారు. మొత్తం 12 పాఠశాలలకు ఆరు పాఠశాలలు 100శాతం ఫలితాలు సాధించాయి.

దుబ్బాక మండలంలో 98.34శాతం ఉత్తీర్ణత



పి.అభినయ (ఆకారం, 10జీపీఏ)



మచ్చ మాధురి (లచ్చపేట, 10జీపీఏ)

దుబ్బాక: దుబ్బాక మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇద్దరు 10 జీపీఏ సాధించినట్లు మండల విద్యాధికారి ప్రభుదాస్ తెలిపారు. ఆకారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.అభినయ, అదేవిధంగా లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన మచ్చ మాధురి 10 జీపీఏ సాధించారు. మండలంలో మొత్తం 98.34శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

దౌల్తాబాద్‌లో నలుగురు

దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా నలుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. దౌల్తాబాద్ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు, అదేవిధంగా మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలకు చెందిన ఒకరు 10 జీపీఏ సాధించారు. రాయపోల్ మండల వ్యాప్తంగా నలుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించినట్లు ఎంఈఓ నర్సమ్మ తెలిపారు. రాయపోల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు, కస్తూర్బా పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి 10 జీపీఏ సాధించారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల, ఘనపురం, కాన్గల్, తొగుట, వెంకట్రావుపేట ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో 15మంది బాలికలు, ముగ్గురు బాలురు 10జీపీఏ సాధించారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి అభినందించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్రవంతి మెరిసింది. 9.8జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల, మల్లుపల్లి, అక్బర్‌పేటలోని భూంపల్లి, ఖాజీపూర్ ఉన్నత పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

సత్తాచాటిన సిద్దిపేట విద్యార్థులు

సిద్దిపేటరూరల్: రూరల్ మండల వ్యాప్తంగా విద్యార్థులు 99.06శాతం ఉత్తీర్ణత సాధించారు. 11 మంది విద్యార్థులు 10జీపీఏ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు. నారాయణరావుపేట మండలంలో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 14 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించినట్లు ఎంఈఓ యాదవరెడ్డి తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలో ఉన్న మొత్తం 17 ఉన్నత పాఠశాలలకు గాను 15 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. నాగపురి జెడ్పీహెచ్ఎస్ 97.13, గుర్జకుంట జెడ్పీహెచ్ఎస్ 83.33శాతం ఉత్తీర్ణత పొందాయి. ముస్త్యాల మోడల్ స్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు పి.అభినవ్‌రెడ్డి, కె.దినేశ్‌లు 10జీపీఏ సాధించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో మొగుళ్ల నర్సింహారెడ్డి తెలిపారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల విద్యార్థులు 98.48 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13 ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ స్కూల్‌లో 5గురు, కేజీబీవీలో ఒక విద్యార్థి 9.7 జీపీఏ సాధించగా, హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థికి 9.8జీపీఏ వచ్చినట్లు ఎంఈఓ పావని తెలిపారు. రేగులపల్లెలోని ఎస్టీ విన్సెంట్ పల్లోటి హైస్కూల్‌లోని 9మంది విద్యార్థులు 10జీపీఏ సాధించగా, 11 ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండలంలో 99 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 17 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మొత్తం 387 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 386 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

100 శాతం ఉత్తీర్ణత

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలంలో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 8 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మొత్తం 431 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 431 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అన్ని పాఠశాలల్లో విజయకేతనం ఎగురవేశారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో 4జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 01 కేజీబీవీ మొత్తం 5 పాఠశాలల్లో 184 మందికి 183 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గిరిజనులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతినాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనుల సత్తా చాటుతామని ఆల్ ఇండిమా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ తిరుపతినాయక్ అన్నారు. అక్కన్నపేట మండలం కేంద్రంలో మర్రిచెట్టు కింద బుధవారం గిరిజన సంఘ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గంలో గిరిజనుల సంఖ్య అధికంగా ఉన్నా నాయకులు తమ రాజకీయ స్వలాభం కోసం తాత్కాలికమైన మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లను దండుకుంటున్నారన్నారు. ఆ తర్వాత గెలిచి గిరిజన తండాల అభివృద్ధిని విస్మరిస్తున్నారని మండిపడ్డారు. అందుకే రానున్న ఎన్నికల్లో మోసపూరిత హామీలకు నమ్మకుండా అందరూ ఐక్యంగా ఉండేలా సిద్ధం కావాలన్నారు. త్వరలో హుస్నాబాద్‌లో 8వేల మంది గిరిజనులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాలోతు సత్యంనాయక్, జిల్లా నాయకులు భూక్య మోతిలాల్, లావుడ్య తిరుపతినాయక్, ఇస్లావత్ రాజు, వివిధ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

గజ్వేల్: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌తో చేపట్టిన సమ్మెలో భాగంగా మూడోరోజు గజ్వేల్ నియోజకవర్గంలోని వీవోఏలు మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలకు గజ్వేల్ పట్టణంలో వినతిపత్రాలు అందించారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు, చేర్యాల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, జిల్లా అధ్యక్షుడు సందెబోయిన ఎల్లయ్యలు మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శారద సమ్మెకు మద్దతు ప్రకటించారు.

కనీస వేతనం చెల్లించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. మిరుదొడ్డి ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం కృష్ణారెడ్డికి బుధవారం వీవోఏలతో కలిసి సమ్మె పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వీవోఏలు జమున, వెంకటలక్ష్మి, స్వప్న, మంగమ్మ, శ్యామల, నసీరుద్దీన్, భూపాల్, మహేశ్, లక్ష్మి, రాణి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ క్యాంపు కార్యాలయంలో భిక్ష

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో గల నూతన క్యాంప్ కార్యాలయంలో గురువారం హనుమాన్ మాలాధారణ స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 8 మండలాల హనుమాన్ స్వాములకు భిక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించే మహా చండీహోమం కార్యాక్రమానికి స్వాములు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చేర్యాల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కరుణాకర్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని శభాష్‌గూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ స్వప్నకిరణ్‌తో కలిసి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనకయ్య, ఏపీఎం బాబురావు, సీసీ పద్మ, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకయ్య, ఏఎస్ఎం రజిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి, సర్పంచ్ గడ్డమీది భాగ్యతో కలిసి ఎంపీపీ గంగాధరి సంధ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, ఏపీఎం కిషన్, నాయకులు తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మ, సర్పంచ్ గాయత్రి పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ప్రకారం రెగ్యులర్ చేయాలి

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌లో తెలిపిన విధంగా 4 సంవత్సరాల ప్రొబేషన్ పూర్తి చేసుకున్న జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేయాలని జేపీఎస్ జేఏసీ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. తమకు మద్దూరు జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, ఉపాధ్యాయ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలపడం సంతోషకరమన్నారు.

కంటి వెలుగు దేశానికే ఆదర్శం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్ రియాజుద్దీన్

సిద్దిపేటజోన్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు దేశానికే ఆదర్శంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అన్నారు. బుధవారం పట్టణంలో కంటివెలుగు శిబిరం నిర్వహణలో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ఆమె సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు పట్టణంలో కంటి వెలుగు ప్రక్రియ దిగ్విజయంగా ముగిసిందన్నారు. రెండో విడతకు ప్రజల్లో మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరించి ఆదుకోండి

కరెంట్ లేక ఎండుతున్న పంటలు



రైతు సాగుచేసిన బెండతోట

తొగుట(దుబ్బాక): విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని ఎల్లారెడ్డిపేట శివారులో రైతులు కూరగాయల పంటలు సాగుచేశారు. పదిరోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షం పడిన విషయం తెలిసిందే. కాగా ఈదురుగాలలకు బోరుబావులకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు తెగికింద పడిపోయాయి. విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామమైన తుక్కాపూర్‌కు చెందిన కొందరు రైతులు ఎల్లారెడ్డిపేట రైతుల నుంచి భూమి కౌలుకు తీసుకొని పంట సాగు చేశారు. ఈదురుగాలులతో విద్యుత్ తీగలు తెగి కిందపడిపోయినా, వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. తమ సమస్యను ఏఈ, లైన్‌మెన్‌ల దృష్టికి తీసుకుపోయినా వారు స్పందించడం లేదని రైతులు వాపోయారు. విద్యుత్ ఏఈకి రోజూ ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు ఆరోపించారు. వడగళ్ల మూలంగా వరి పంట నష్టపోయినా, కూరగాయలు పండించుకొని కుటుంబాలను పోషించుకుందామంటే అధికారుల తీరుకు తాము నిలువునా మునిగిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు దౌల్తాబాద్‌లో తైబజార్ వేలం

దుబ్బాక: దౌల్తాబాద్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి తైబజార్, పశువుల సంత వేలం పాట గురువారం నిర్వహిస్తున్నట్లు దౌల్తాబాద్ ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగే వేలం పాటకు ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు ముందు రూ.10వేలను డిపాజిట్ చేయాల్సి ఉంటుందని సూచించారు. వేలంను దక్కించుకున్న వారు అదేరోజు సగం డబ్బులు చెల్లించాలన్నారు.

◆ ఈనెల 15 నుంచి సీఎం కప్ క్రీడలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 15 నుంచి 17వ తేదీవరకు సీఎం కప్ మండల స్థాయి క్రీడలను నిర్వహించనున్నట్లు బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల తెలిపారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా నిర్వహణ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అథ్లెటిక్స్, కబడ్డీ, కోకో, వాలీబాల్ మహిళలకు, ఫుట్‌బాల్ పురుషులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.15 నుంచి 36 సంవత్సరాలున్న వారు అర్హులని ఆసక్తి గలవారు మండల పరిషత్ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో ఈ నెల 22 నుంచి, రాష్ట్రస్థాయిలో 28వ తేదీ నుంచి నిర్వహించే క్రీడలకు ఎంపిక చేస్తారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ, క్రీడల కన్వీనర్ రాము, సభ్యులు ఎస్ఐ ప్రవీణ్ రాజు, ఆర్ఐ రాజయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

◆ ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించాలి

హుస్నాబాద్‌రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు వేతనాలను త్వరగా చెల్లించాలని సీపీఐ నాయకుడు గడిపె మల్లేశ్ అన్నారు. బుధవారం నాగారం, ఉమ్మాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. నెలల తరబడి కూలీలకు డబ్బులు లేకపోతే ఎలా బతుకుతారని మండిపడ్డారు. అధికారులు స్పందించి కూలీలకు డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ బీజేవైఎం హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా జేరిపోతుల శ్రీనివాస్

హుస్నాబాద్: బీజేవైఎం హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా జేరిపోతుల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొంగోని సురేష్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశాడు. అనంతరం తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సురేశ్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ నిరుద్యోగ మార్చ్‌కు భారీగా తరలిరావాలి

ములుగు(గజ్వేల్): ఈ నెల 11న సంగారెడ్డిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పల్లె రమేశ్‌యాదవ్ కోరారు. మండలంలోని వంటిమామిడిలో బుధవారం ఆయన నాయకులతో కలసి వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు శ్రీను, అంజిరెడ్డి, కిషన్, శేఖర్‌రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర సర్వే చేపట్టాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన నిరుపేదలకు కేటాయించే డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర సర్వే చేపట్టాలని డబుల్ బెడ్రూం సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులు ఎంతో కాలంగా డబుల్ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన వారికి అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వే చేపట్టి అర్హులకు ఇళ్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఈనెల 15న కలెక్టరేట్ ముట్టడి నిర్వహించేందుకు తీర్మాణించామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పద్మ, జ్యోతి, కవిత, మహేందర్, నర్సింలు, శ్రీనివాస్, పోశయ్య, లక్ష్మి, నాగేశ్ పాల్గొన్నారు.

◆ గంగాపూర్ అభివృద్ధికి కృషి

మర్కూక్(గజ్వేల్): గంగాపూర్ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. బుధవారం గంగాపూర్ గ్రామస్తులు జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిశారు. తమ గ్రామానికి హైమాస్ట్ లైట్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాల్‌రాజు, పవన్‌సింగ్, దుర్గన్‌సింగ్, రాజు, పాండు, ఐలేనియాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

◆ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

హుస్నాబాద్‌రూరల్: రైతులు పండించిన మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనితిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం వంగరామయ్యపల్లిలో ఎంపీపీ లకావత్ మానసతో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.